ఇంకని వర్షపు నీరు..!

- ఇంకుడు గుంతల్లో చేరిన చెత్తాచెదారం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: వేసవిలో చాలా గ్రామాల్లోవ్ల భూగర్భజలాలు అడుగంటి, తాగునీటి కోసం ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. భూగర్భ జలాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2006 జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించాయి. ఇంటి ఆవరణతో పాటు గ్రామాలోని చేతి పంపులు, నీటి ట్యాంకుల సమీపంలో, గ్రామ శివారు ప్రాంతాలలో ఇంకుడు గుంతలు నిర్మించారు. ఇంటి ఆవరణలో 6 పీట్లు లోతు, 4 పీట్ల రింగులతో రూ. 6,100తో నిర్మాణం, గ్రామంలో చేతిపంపు, వాట్ ట్యాంకుల వద్ద 2 మీటర్లు పొడవు, వెడల్పు, 2 మీటర్లు లోతులో రూ. 13,200, గ్రామంలోని నీరు ఇంకుడు గుంతలో చేరేలా గ్రామ శివారు ప్రాంతంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతను రూ. 16,200 వ్యయంతో రెండున్నర మీటర్ల వెడల్పు, పొడవు, లోతుతో చేపట్టారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. వాటి పర్యవేక్షణ లేక పోవడంతో ప్రస్తుతం చాలా గ్రామాల్లో అందులో నీరు చేరక నిరుపయోగంగా మారాయి.

కొరవడుతున్న పర్యవేక్షణ..

వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలో చేరేందుకు ఆదిలాబాద్ ఉమ్మడి మండలంలో గతంలో సుమారు పన్నెండు వందల వరకు ఇంకుడు గుంతలు చేపట్టారు. అయితే ప్రస్తుతం పలు గ్రామాలలోని చేతిపంపుల వద్ద, వాటర్ ట్యాంకుల వద్ద, గ్రామ శివారు ప్రాంతంలో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడు గుంతలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఇంకుడు గుంతలలోకి వర్షం నీటితో మట్టి, చెత్తా, చెదారం చేరి, వర్షపు నీరు ఇంకకుండా వృథా అవుతుంది.



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచికంటి గ్రామంలో చేతిపంపు వద్ద రూ. 13,200 నిర్మించిన సాధారణ ఇంకుడు గుంత. ఇందులో వర్షపు నీటికి కొట్టుకువచ్చి మట్టి చేరడంతో నీరు ఇంకకుండా వృథా అవుతుంది. ఇది కేవలం ఈ ఒక్క గ్రామంలోనే కాదు. ఇలాంటి మరెన్నో ఉన్నాయి.

ఊసే లేని నిర్మాణాలు..

ప్రతీ గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని గత వారం రోజుల కిందట జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రామాల్లో గ్రేవాటర్ ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. దీనికి రూ. 95వేలు వ్యయం చేయనున్నారు. మండలంలో కేవలం చాందా (టి), యాపల్‌గూడలో గ్రామాలలో మాత్రమే రెండేసి చొప్పున నిర్మించారు. మిగితా చోట వాటి నిర్మాణాలు ఊసే లేదు. ఇదిలా ఉండగా సకాలంలో నిధులు రాకపోవడంతోనే నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



బోథ్: పూజలు చేస్తున్నఎమ్మెల్యే అనిల్ జాదవ్



బోథ్: పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్

బోథ్/నేరడిగొండ/ఆదిలాబాద్: సొనాల మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన దుర్గామాత యజ్ఞ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పల్సితండా సోను మాతతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని దుర్గామాతను మొక్కుకున్నారు. నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో దుర్గామాత మండలపాలను దర్శించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కొలువుదీరిన దుర్గామాత, శారదదేవి మండపాల వద్ద మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ మండల కేంద్రంలోని దుర్గామాతకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోథ్, సొనాల మండలాల్లోని పలు గ్రామాల్లో దుర్గామాత మండపాలను సందర్శించారు.

ఘనంగా నిమజ్జనం..

సిరికొండ: మండల కేంద్రంలో బుధవారం నవరాత్రులు పూజలందుకున్న దుర్గామాత నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతర గ్రామాల్లో శోభాయాత్ర చేట్టారు. సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

వైభవంగా మహా హారతి

బేల: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహంకాళి ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక మహా హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నవమి రోజు కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 1001 హారతులతో మహిళలు ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని చేపట్టారు,. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆయన నివాసంలో సాత్నాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, దేవన్న, లక్ష్మణ్, ప్రమోద్, మతీన్ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు రావాలని కలెక్టర్‌కు ఆహ్వానం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈనెల 4న నిర్వహించే బతుకమ్మ వేడుకలకు హాజరు కావాలని గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌ను ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలల్లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానంద్, కొడాల మహేందర్, నారాయణ, కొడాల నారాయణ పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న బేల మండలంలోని పొనాల గ్రామానికి చెందిన సర్వర్ జాన్వికి 'ఓ-పాజిటివ్' రక్తం అవసరం ఉందని వైద్యులు సూచించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డిని సంప్రదించగా ఆయన బండల్‌నాగాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ ద్వారా బుధవారం రక్తదానం చేయించారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: దసరా పండుగ నేపథ్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని ఏదైనా ప్రాంతానికి 30 మంది వరకు ప్రయాణికులు ఉంటే వారు కోరిన చోటికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హైమద్ కూతురు ఇటీవల మరణించింది. కాగా.. ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ రిటైర్డు రాంకిషన్ నాయక్, ఈఈ జాదవ్ గుణవంత్ రావు, చహాన్ రమేశ్, మడావి లక్ష్మణ్, కనకరావు పాల్గొన్నారు.

లక్కీ డ్రా సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: దసరా సమయంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా డ్రాప్ బాక్స్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఈనెల 6 సెమి డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, రాజధాని బస్సు సర్వీసులలో ప్రయాణించే వారు లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ప్రయాణికులు టికెట్ వెనకల ఫోన్ నెంబర్ పేరు రాసి ఆదిలాబాద్ బస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా డ్రాప్ బాక్స్ లో వేయాలన్నారు. ముగ్గురు విజేతలకు ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ. 25,000, రెండో బహుమతిగా రూ. 15,000, మూడో బహుమతి రూ. 10,000 అందించడం జరుగుతుందని వివరించారు.



లక్కీ డ్రాలో టికెట్ వేస్తున్న ప్రయాణికులు

మారుమూల ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు

ఆదిలాబాద్: మారుమూల ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవలను మరింతగా విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన 25వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు సిల్వర్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో పట్టణంలో ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ టెలికాం కంపెనీలు వెళ్లలేని ప్రాంతాల్లోనూ కూడా 4జీ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ జెస్సీ, ఎస్డీఈలు ప్రమోద్ కుమార్, హరి శంకర్, రవీందర్, ఏవో నారాయణ, జేటీవోలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, మహేందర్, శ్రీనివాస్‌రావు, జేఈలు సంజయ్, దత్త కుమార్, రాకేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజీఎం సీతారాం

'కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి'

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల మాజీ సర్పంచ్ ఎల్లుల అశోక్ ఆధ్వర్యంలో దాదాపు 70 మంది గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఎల్లవేళల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్ రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, నాయిడి రవి, స్వామి, కుంట శంకర్, బద్దం పోతారెడ్డి, రమేశ్, బానోత్ వసంత్ రావు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్

బోథ్: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. సొనాల మండలంలోని కోట(కె) గ్రామంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో అభివృద్ధి ద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన, కసిరే పోతన్న, రామయ్ రాము, బత్తుల రమేశ్, చెట్లపెల్లి అనిల్, విజయ్ భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, పోశెట్టి, సోమన్న, సంతోష్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

గుడిహత్నూర్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా మాంగ్ సమాజ్ అధ్యక్షుడు గాడేకర్ పరశురామ్ అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోతివార్ శ్రీహరి, అశోక్, భోబ్రాజీ, విశ్వనాథ్, శుభం, గణపత్, చంద్రకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరశురామ్

'సమర్థుల జాబితా సిద్ధం చేయాలి'

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థులైన, గెలిచే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఇన్‌చార్జిలను నియమించనున్నట్లు తెలిపారు. ఒక్కో మండలానికి 8 నుంచి 10 మంది వరకు నాయకులను పోటీకి సిద్ధంగా ఉండే జాబితాను రూపొందించాలన్నారు. తుది జాబితాను అదిష్టానం నిర్ణయం మేరకు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

కాంగ్రెస్‌లో పలువురు చేరారు. ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రిటైర్డ్ ఎంఈవో నర్సిములు, ఎస్సీ కార్పొరేషన్ రిటైర్డ్ సూపరింటెండెంట్ శంకర్‌లు ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

జోరుగా 'బెల్ట్' దందా!

- గల్లీగల్లీకో మద్యం దుకాణం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

బోథ్, సొనాల మండలాల్లో బెల్ట్ షాపులు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ దందా నిరుపేద కుటుంబాల జీవితాలను ఛిద్రం చేస్తోంది. గల్లీగల్లీకి విక్రయిస్తుండడంతో యువత మద్యానికి బానిస అవుతున్నారు. కూలీలు, దినసరి వేతనదారులు సంపాధించిన డబ్బును ఇంట్లో ఇవ్వకుండా, క్షణాల్లో బెల్ట్‌షాపుల పరం చేస్తున్నారు.

విచ్చలవిడి అమ్మకాలు..

ప్రతీ గ్రామంలో కిరాణా దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లు, చివరికి కొన్ని ఇళ్లు సైతం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. బోథ్, సొనాల మండల కేంద్రాల్లోని మద్యం షాపులు మూసివేసిన తర్వాత కూడా అర్ధరాత్రి వరకు మద్యం దొరుకుంది. ప్రభుత్వ ధరల కంటే రూ. 30 నుంచి రూ. 50 అధికంగా అమ్ముతున్నారు. మద్యానికి అలవాటైన వ్యక్తులు ఆ ధర చెల్లించలేక అప్పులు చేసి మరీ తాగుతున్నారు. ఆర్థిక చిక్కులు, గృహ హింసకుటుంబ పోషణకు, పిల్లల చదువులకు అవసరమైన డబ్బు మద్యానికి పోవడంతో, కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. వంట గిన్నెలు, తాళీబొట్లు, చివరికి ఉన్న కొద్దిపాటి భూమిని కూడా అమ్ముకొని రోడ్డున పడుతున్నారు. మద్యం సేవించిన మత్తులో భర్తలు గృహ హింసకు పాల్పడుతుండటంతో, గ్రామాల్లోని మహిళలు కన్నీరుమున్నీరవుతున్నారు.



ఉక్కుపాదం ఎక్కడ?

జిల్లాకు కొత్త పోలీస్ సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ వచ్చిన కొత్తలో బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపారు. బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో కొంతవరకు బెల్ట్ షాపులు మూతబడ్డాయి. అయితే, కాలక్రమేణా ఆ దాడుల తీవ్రత పూర్తిగా తగ్గిపోయింది. దీంతో, నిర్వాహకులు ఎటువంటి భయం లేకుండా మళ్లీ యథావిధిగా వ్యాపారం ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్ట్‌షాపు దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిందేసిన పోలీసులు



నృత్యం చేస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. రాత్రి బందోబస్తులో ఉన్న పోలీసులు ఉట్నూర్ గంగన్నపేట చెరువు వద్ద చిందేశారు. పాటలకు ఆడిపాడారు. పోలీసుల నృత్యాన్ని అక్కడున్న వారు ఫోన్‌లో బంధించారు.

పోలింగ్‌కేంద్రాల పరిశీలన

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వివిధ వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై జీవన్‌రెడ్డి, ఏఎస్సై ఉత్తం, రెవెన్యూ సిబ్బంది రాఘవేందర్, తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా బుధవారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను, నామినేషన్ కేంద్రాన్ని ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి షకీల్ అహ్మద్‌కు పలు సూచనలు చేశారు. ఆయా కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలన్నారు. మౌలిక వసతులు, భద్రతా లోపం లేకుండా చూడాలని సూచించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ

సీతాఫలాలకు గిరాకీ



సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఉట్నూర్‌రూరల్: సీతాఫలాలను చూడగానే ప్రతిఒక్కరికీ నోరురుతోంది. ఈ ఏడాది సీతాఫలాలు విరివిరిగా లభిస్తుండడంతో ఉట్నూర్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు ఆదిలాబాద్, మంచిర్యాల ప్రధాన రహదారిపై సీతాఫలాలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు., ఆ రోడ్డు గుండా వెళ్లే వారు కొనుగోలు చేస్తున్నారు. ఈ పండ్లతో అనేక ఆరోగ్య లాభాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఉద్యోగ విరమణ సహజం

నేరడిగొండ: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని టీఎస్ యూటీఎఫ్ నేరడిగొండ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. సెకండరి గ్రేడ్ టీచర్ ఉద్యోగ విరమణ పొందిన కృష్ణకుమార్‌ను బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు శివలీల, సుధరాణి, ఉదయకిరణ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

తలమడుగు: చదువుతూనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బరంపూర్ గ్రామపెద్దలు కేదరేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన దాసరి ఆశన్న కూమార్తె సిందూజ, మేకల ప్రభాకర్ కుమార్తె శ్రీనిధి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్‌రూరల్: సంఘ భవనం షెడ్డు నిర్మాణానికి నిధులు విడుదల కావడంతో జిల్లా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎల్లుల భోజన్న, మేకల అశోక్, డైరెక్టర్లు, కులస్తులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ పరిధిలోని కోపర్గాడ్ గ్రామంలో బీజేపీ నాయకులు రోడ్డుకు మరమ్మతులు చేశారు. ట్రాక్టర్ సాయంతో రోడ్డును చదును చేశారు. నాయకులు బింగి వెంకటేశ్, దావులే బాలాజీ, కందుకూరి రమేశ్, సాల్గర్ రవీందర్, చక్రం మాణిక్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: మండల కేంద్రానికి చెందిన కరిపె సాయికమల్ ఇటీవల విడుదలైన గ్రూప్ 1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించిన సందర్భంగా బుధవారం బోథ్ పట్టణ వంజరి సంఘం ఆధ్వర్యంలో సాయికమల్‌తో పాటు తల్లిదండ్రులు మల్లేష్, రేవతిలను ఘనంగా సత్కరించారు. వైద్యులు రవీంద్రప్రసాద్, పోతన్న, విజయ్ కుమార్, కర్పే శ్రీనివాస్, కానుకంటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న శశికళ, బుక గంగయ్య, చిలుక సతీష్, నీలం వెంకట్‌లను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో గంద్రత్ నారాయణ, పసుల ప్రతాప్, మంద అశోక్, రాజశంకర్, కొమ్ము కృష్ణ కుమార్, సాయిరి శ్రీకాంత్, మూగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదాలు'

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ ఆరోపించారు. బుధవారం పలువురితో కలిసి కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. ఎన్‌హెచ్ 353(బి) నిర్మాణంలో భాగంగా తర్నం వాగుపై ఏర్పాటు చేసిన లోలెవల్ బ్రిడ్జి వద్ద తరచూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నాయని, కాంట్రాక్టర్ ఇరువైపులా రోడ్ల కనెక్టివిటి సరిగా చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వేణుగోపాల్